క్లుప్తంగా

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి : వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ శ్రీనివాసరావు ప్రయాణికులకు సూచించారు. మండలంలో ఉంగరాడ మెట్టవద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించి ప్రయాణాలు చేస్తే తమతో పాటు ఇతర ప్రయాణికులు కూడా ఎటువంటి ప్రమాదాలకు గురికారని అన్నారు.

ఎస్ఈబీ అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఈబీ సీఐ జైభీమ్, తదితరులు

బొబ్బిలి: పట్టణ పరిసర ప్రాంతాలైన కృష్ణాపురం రోడ్డు, కోటిచెరువు గట్టు, ఇందిరమ్మ కాలనీ, తదితర ప్రదేశాల్లో ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ, ఎవరైనా మాదకద్రవ్యాలు, సారా కలిగి ఉంటే చర్యలు తప్పవన్నారు.

రహదారి పనుల పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: పట్టణంలోని మారుతీనగర్‌లో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మున్సిపల్ కార్యాలయ ఏఈ రత్నాకర్ వెల్లడించారు. మారుతీనగర్ నుంచి వాసవీనగర్‌కు రోడ్డును అనుసంధానం చేసేందుకు ఈ సీసీ రోడ్డు ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను ఏఈతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పరిశీలించారు.

నాగావళిలో జల కళ



సంకిలి వద్ద నదిలో నీరు

రేగిడి : మండలంలోని సంకిలి వద్ద నాగావళి నది నీటితో కలకలలాడుతుంది. వేసవిలో నాగావళి నది సాధారణంగా ఎడారిని పోలి ఉండేది. ఈ ఏడాది మాత్రం వర్షాలు పడుతుండడం, ఎగువ ప్రాంతాల నుంచి నీరు నదిలోకి రావడంతో నదిలో జలకళ కనిపించి, తీర ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నది ఆదుకుంటుంది.

లైసెన్స్ తప్పనిసరి



వాహనాల చలానాలను పరిశీలిస్తున్న ఎస్సై

రాజాం సిటీ: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్స్ తప్పకుండా ఉండాలని ఎస్ఐ పి.నీలావతి అన్నారు. స్థానిక శ్రీకాకుళం రోడ్డులో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించి అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన పెండింగ్ చలానాలను కూడా వసూలు చేశామని తెలిపారు.

ఘనంగా రామమందిర ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని రేజేరులో నూతనంగా నిర్మించిన రామమందిరాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించగా.. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని పూజలు చేశారు. అంతకుముందు ఆంజనేయ సమేత సీతా,రామ,లక్ష్మణస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొమ్మి నాయుని రమేష్, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, కమిటీ భక్తులు పాల్గొన్నారు.

సాకారమవుతున్న సొంతింటి కల...



రామభద్రపురం జగనన్న కాలనీలో జోరుగా సాగుతున్న ఇంటి నిర్మాణాలు



ఆరికతోట జగనన్న లేఅవుట్‌లో వేగంగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ



సీఎం జగనన్న సొంతింటి కల నెరవేర్చారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఎదుట సంతోషం వ్యక్తంచేస్తున్న లబ్ధిదారు యడ్ల వరాలు

ప్రతి ఒక్కరూ సొంతిల్లు ఉండాలని కోరుకుంటారు. అయితే చాలామంది పేద, మధ్య తరగతి ప్రజలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లోనే సంవత్సరాలుగా కాలక్షేపం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించక చాలా మంది సొంతింటి గురించి ఆలోచించడమే మానేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలను దగ్గరుండి చూశారు. ఈ సమయంలో అర్హులందరికీ సొంతిళ్లు మంజూరు చేస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్య తరగతి వారికి జగనన్న కాలనీల పేరిట సొంతిళ్లు మంజూరు చేశారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం చేయడమే కాకుండా తక్కువ ధరకు నిర్మాణ సామగ్రి అందిస్తున్నారు. అలాగే కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, కాలువలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయిస్తున్నారు. కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు కావడం, బిల్లులు చకా చకా మంజూవుతుండడం, రాయితీపై నిర్మాణ సామగ్రి అందించడంతో లబ్ధిదారులు కూడా యుద్ధ ప్రాతిపదికన నిర్మాణలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 651 జగనన్న లే అవుట్‌లలో 77,621 ఇళ్లు మంజూరు చేశారు. కాలనీల్లో రూ.21.39 కోట్లతో నీటివసతి, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇంటర్నల్ రోడ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సుమారు 40 వేల ఇళ్లు పూర్తవ్వగా.. దాదాపు 727 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించారు.

– రామభద్రపురం

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



విశ్వసాయి మందిరంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రసాదరావు

రేగిడి : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వక్త పడాల ప్రసాదరావు అన్నారు. మండలంలో రేగిడి విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక దివ్య మహా సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతున్ని చేరుకునేందుకు ఆధ్యాత్మికతతో కూడిన సేవాభావం ఒక్కటే మార్గమని వెల్లడించారు. భక్తులు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి నడవడిక వారధిగా ఉంటుందని, ఇందులో ప్రతీ మనిషి ప్రతిబింబం కనిపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

కేజీబీవీకి అదనపు తరగతి గదులు



నిర్మాణంలో అదనపు తరగతి గదులు

వంగర: స్థానిక కేజీబీవీ విద్యాలయంలో అదనపు తరగతి భవనాల నిర్మాణం చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ కేజీబీవీలో ఇప్పటి వరకు పదో తరగతి వరకు ఉండగా ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రవేశపెట్టారు. దీంతో ప్రభుత్వం నాడు – నేడు ద్వారా రూ.96లక్షల నిధులు సమకూర్చింది. ఈ నిధులతో ఎనిమిది అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని ఇంజినీరింగ్ అసిస్టెంట్ గొంగాడ ప్రసాదరావు తెలిపారు.

ఘనంగా నాద నీరాజనం



వేణుగోపాలస్వామి ఆలయంలో నాద నీరాజనం

రాజాం సిటీ: స్థానిక రాజవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వాసవీక్లబ్ వనితకాంతి కిట్టి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నాద నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. అన్నమాచార్య జయంతిని పురష్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులచే నృత్య ప్రదర్శన, నాద నీరాజనం జరిపారు. అనంతరం పలువురికి సత్కరించారు. కార్యక్రమంలో కాంతికిట్టి సభ్యులు కొల్లా శాంతి, వి.ఝాన్సీ, హెచ్.సుబ్బలక్ష్మి, ఎం.కృష్ణవేణి, కె.ప్రశాంతి, కె.రోజా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు ప్రాధాన్యం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

బొబ్బిలి: ప్రజాసేవకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. రెండు మండలాల కూడలి అయిన కుసుకువానివలస మూడు రోడ్ల జంక్షన్‌లో నిర్మించిన గౌతమ బుద్ధుడి విగ్రహం, బస్ షెల్టర్‌ను పరిసర గ్రామాల సర్పంచ్‌లు, బొబ్బిలికి చెందిన పట్టణ ప్రముఖులు ఆదివారం ప్రారంభించారు. పాత్రేరు, భీమవరం, కుసుకువానివలస గ్రామాల సర్పంచ్‌లు ఉడమల వివేక, చప్ప గౌరమ్మ, కుసుకు రాధల చేతుల మీదుగా ప్రారంభించిన కార్యక్రమంలో బొబ్బిలి శ్రీ కళాభారతి కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, నట సమాఖ్య అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పార్వతీపురం మన్యం జిల్లా పీఆర్‌టీయూ నాయకులు వాలేటి తవిటినాయుడు, నిర్వాహకులు చప్ప అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులపై విస్తృత ప్రచారం



బాడంగిలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి, గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్

బాడంగి: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక లైబ్రేరియన్ ఆర్. దుర్గాప్రసాద్, పింద్రింగివలస పాఠశాల హెచ్ఎం వై.రవిబాబు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో శిక్షణ తరగతులపై ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ నుంచి వచ్చేనెల 11 వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణను వినియోగించుకోవాలన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన



రామభద్రపురం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును సీఐ తిరుమలరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామభద్రపురం మండల కేంద్రం అంతర్రాష్ట్ర కూడలి కావడంతో బోర్డర్‌లో ఉన్న ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రధాన కూడళ్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఎస్సై సురేంద్రనాయుడు, తదితరులున్నారు.

వాహన తనిఖీలు



భోగాపురం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

భోగాపురం: ఎస్ఈబీ సీఐ ఎంవీఆర్ అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి భోగాపురం జాతీయ రహదారిపై వాహన తనిఖీ లు చేపట్టారు. శ్రీకాకుళం – విశాఖపట్నం జాతీయ రహదారి మీదుగా వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలు ఎక్కువగా రవాణా అవుతు న్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలి పారు. మాదకద్రవ్యాలతో ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



జగదీష్‌ను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లెంక జగదీష్ పదో తరగతి ఫలితాలలో 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. తానేమీ కార్పొరేట్ పాఠశాలకు తక్కువ కాదంటూ నిరూపించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశలకు జీవం పోశాడు. జి.సిగడాం మండలం నక్కపేటకు చెందిన జగదీష్ తల్లిదండ్రులు అప్పలనాయుడు, లక్ష్మి వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుమారుడుని చదివించుకుంటున్నారు. మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని హెచ్ఎం ఎస్.సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు ఆదివారం పాఠశాలలో అభినందించారు. రాజాం పట్టణంతో పాటు మండలంలో పదో తరగతి ఫలితాల్లో 61 శాతం ఉత్తీర్ణత లభించిందని ఎంఈఓ పాండ్రంకి నాగయ్య తెలిపారు. పాఠశాలల వారీగా పొందిన ఫలితాలను ఆయన వెల్లడించారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 853 మంది విద్యార్థులకుగాను 523 ఉత్తీర్ణత సాధించడంతో 61.31 శాతం ఉత్తీర్ణత లభించిందని వివరించారు. బొద్దాం జెడ్పీ హైస్కూల్‌లో 82 మందికి 40 మంది, దోసరి పాఠశాలలో 29 మందికి 19 మంది, కంచరాం ఉన్నత పాఠశాలలో 134 మందికి 73 మంది, పొగిరి జెడ్పీ హైస్కూల్‌లో 146 మందికి 94 మంది, రాజాం(సారధి) జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులకు గానూ 31 మంది, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 205 మందికి 128 మంది, రాజాం కేజీబీవీ పాఠశాలలో 41 మందికి 30 మంది, డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో 161 మందికి 108 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. బొద్దాం స్కూల్ టాపర్‌గా 542 మార్కులతో మద్దు చిరంజీవి, దోసరి స్కూల్ టాపర్‌గా 501 మార్కులతో కె.గాయత్రిశ్రీ, కంచరాం స్కూల్ టాపర్‌గా 563 మార్కులతో ఎస్.లావ్య, పొగిరి స్కూల్ టాపర్‌గా 588 మార్కులతో లెంక జగదీష్, రాజాం(సారధి) జెడ్పీ గరల్స్ హైస్కూల్ టాపర్‌గా 584 మార్కులుతో ఆర్.అక్షిత, రాజాం కేజీబీవీ పాఠశాల టాపర్‌గా 560 మార్కులతో శ్యామల, డోలపేట హైస్కూల్ టాపర్‌గా 576 మార్కులతో వి.వాసుదేవరావు నిలిచారని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాత

విజయనగరం ఫోర్ట్: నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో యూటీఎఫ్ నాయకుడు శేషగిరి జ్ఞాపకార్థం ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు.కార్యక్రమంలో రాములు, దయానంద్, హేమ పాల్గొన్నారు.

సామాజిక ఆస్పత్రికి నలుగురు వైద్యుల నియామకం



డాక్టర్ కరణం హరిబాబు



డాక్టర్ ఎంసీహెచ్ నాయుడు

రాజాం సిటీ: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి మరో నలుగురు వైద్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నలుగురు వైద్యులతో మొత్తం 19 మంది సేవలు అందించనున్నారని సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇంత వరకు రాజాం ఆస్పత్రిలో 17 మంది వైద్యులు పని చేయగా వారిలో సీహెచ్ నాగేశ్వరరావు (ఎండీ జనరల్)ను సాలూరుకు, శ్రీనివాసరావు (చిన్నపిల్లల వైద్యులు)ను ఎస్.కోటకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. వీరి స్థానంలో గజపతినగరంలో సీఎస్ఆర్ఎంఓగా పని చేస్తున్న ఎం.చంద్రశేఖర్‌నాయుడును సీఎస్ఆర్ఎంఓగా, పార్వతీపురంలో పని చేసిన చిన్నపిల్లల వైద్యులు కరణం హరిబాబు, నర్సీపట్నంలో పని చేసిన జనరల్ సర్జన్ దామోదరప్రధాన్, అగనంపూడి నుంచి జనరల్ ఫిజిషియన్ కల్యాణబాబులు రానున్నారని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం నుంచి బదిలీ ఉత్తర్వులు అందాయని తెలిపారు. వీరు చేరితే ప్రస్తుతం ఆస్పత్రిలో 19 మంది వైద్యులు విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులతో సెట్విజ్ సీఈఓ, కోచ్ తదితరులు

● సెట్విజ్ సీఈఓ రామగోపాల్

బొబ్బిలి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సెట్విజ్ సీఈఓ డి.రామగోపాల్ అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి విద్యార్థులు, కోచ్ బంకురు ప్రసాద్‌తో ముచ్చటించారు. తైక్వాండో శిక్షణపై పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాతీయ షటిల్ క్రీడాకారుడు అపర్ణబాబా తదితరులున్నారు.

అల్లూరికి ఘన నివాళులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసు, తదితరులు

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువువలసలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమరసతా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు, రామాలయ కమిటీ అధ్యక్షుడు రాయల పాపారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి ధైర్య సాహసాలను, దేశభక్తిని విద్యార్థులకు వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం : రాష్ట్రంలో పేద ప్రజలకు ఆపన్నహస్తంగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందుతుందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గడిముడిదాం గ్రామానికి చెందిన ఏగిరెడ్డి సిమ్మమ్మ (సింహాచలం) అనే మహిళకు రూ.40 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ ఆదివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందించేది కాదని అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు సీఎం సహాయం కోరిన వెంటనే దరఖాస్తు ద్వారా సీఎంఓ ఆఫీస్ నుంచి రిలీఫ్ ఫండ్ చేస్తున్నారని తెలిపారు. సిమ్మమ్మకు అనారోగ్యం కారణంగా ఇటీవల ఆపరేషన్ జరిగిందని, సీఎంఆర్ఎఫ్‌కు నేరుగా దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జీసీఎస్ కన్వీనర్ శ్రీరంగంనాయుడు, ఇల్లంనాయుడువలస నేత ముళ్ల రమణ, చీడి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి ప్రారంభించనున్న వేసవి విజ్ఞానశిబిరంలో చిన్నారులు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి కోరారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞానశిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8 నుంచి ప్రారంభంకానున్న వేసవి విజ్ఞానశిబిరం వచ్చే నెల 11 వరకు కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

రజక సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు

విజయనగరం అర్బన్: రజక సంక్షేమానికి పనిచేస్తున్న వివిధ సంఘాల ఐక్యవేదిక ఏర్పాటైంది. ఆదివారం స్థానిక దాసన్నపేట కమిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. ఉమ్మడి విజయనగరం పరిధిలో ఏర్పాటైన ఐక్య వేదికకు చైర్‌పర్సన్‌గా ఎలిగాపు విజయలక్ష్మి, గౌరవ అధ్యక్షుడిగా మలిచర్ల చిట్టితల్లి, అధ్యక్షుడిగా తంగేటి భాస్కరరావు, కార్యదర్శిగా జంపా చిన్నా, ముఖ్య సలహాదారులుగా రాయవలస గోవింద, పొలిమేర చెల్లారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా కెల్ల సత్యం, పొట్నూరు శ్రీను, కోశాధికారి మడిపల్లి రాజారావు, సహాయ కోశాధికారి గంట్రేటి ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీ ఎలిగాపు గణపతి, గంట్రేటి సింహాచలం, ఎంఎస్‌పీ రాజు, తదితరులు ఎంపికయ్యారు.

నేటి సమానత్వం అంబేడ్కర్ చలువే..



అంబేడ్కర్ భవనంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

విజయనగరం: నేటి సమాజంలో అన్నివర్గాల వారూ సమానత్వంతో ఉన్నారంటే అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చలవేనని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి మహోత్సవాల సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు జామాన శ్రీనివాసరావు, గండిపల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యతన్నారు. అంబేడ్కర్‌ను నమ్ముకున్న ఏ ఒక్కరూ తప్పులు చేయరని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, బుంగ భానుమూర్తి, గార సత్యనారాయణ, సుజాత, మహేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.